శుష్కించిన జీఎన్ఎస్ఎస్

గాలేరు నగరి కాల్వకు సిమెంట్ లైనింగ్ వేసిన దృశ్యం



గాలేరి-నగరి కాల్వకు సిమెంట్ లైనింగ్ చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. కాలువ పొడవునా కలగాల్సిన ప్రయోజనాలు అడుగంటి శుష్కప్రవాహంగా మారిపోయింది. దీని వల్ల జీఎన్ఎస్ఎస్ ప్రయోజనాలు తగ్గిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణానది వరద నీటితో రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు 1988లో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. 2005 నుంచి పనులు ప్రారంభించారు. రాయలసీమలోని 2.65 లక్షల ఎకరాలకు, నెల్లూరు జిల్లాలో 2.14 లక్షల ఎకరాలకు ఈ పథకం సాగునీరు అందించాలి. మొత్తంగా 10లక్షల జనాభాకు తాగునీరు అందించాలి. అయితే ఈ కాలువకు సిమెంట్ లైనింగ్ చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయాయని ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

- లైనింగ్‌తో అడుగంటిన భూగర్భ జలాలు
- పరివాహక గ్రామాల్లో ఆగిపోయిన ఖరీఫ్ పంటలు
- తాగు నీటికీ తప్పని ఇబ్బందులు

బనగానపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నుంచి 38 టీఎంసీల మిగులు జలాలను 30 రోజుల్లో తరలించేలా గాలేరు నగరి పథకాన్ని తీర్చిదిద్దారు. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా గోరుకల్లు రిజర్వాయర్, అవుకు రిజర్వాయర్ ద్వారా కడప, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు తరలించేందుకు గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఉమ్మడి రాష్ట్రంలో శ్రీకారం చుట్టాయి. మట్టికట్టతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 57కిలోమీటర్ల మేర తవ్వి రైతులకు సాగు, తాగు నీరును అందిస్తున్నారు. గాలేరు నగరి కెనాల్ మట్టి కట్టతో నిర్మించడం వల్ల పాణ్యం, బనగానపల్లె, అవుకు, సంజామల మండలాల్లోని గాలేరు నగరి కాల్వ పరివాహక పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లోని పొలాల్లో బోరుబావుల్లో భూగర్భ నీరు పెరిగి రైతులు రెండుసార్లు పంటలు పండించుకొనేవారు. కాల్వకు ఇరువైపులా మట్టికట్టలు ఉండడంతో భూగర్భ నీరు పెరిగి రైతులకు సాగునీటికి ఢోకా ఉండేది కాదు.



గాలేరి నగరి కాల్వ పారుతున్న దృశ్యం (ఫైల్)

గాలేరు నగరి కాల్వకు సిమెంట్ లైనింగ్ పనుల పూర్తి

గత వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గాలేరు నగరి కాల్వకు మట్టికట్టకు తూట్లు పొడిచారు. మట్టికట్ట స్థానంలో గాలేరు నగరి కాల్వకు ఇరువైపులా, కింది భాగంలో సిమెంట్ లైనింగ్ ఏర్పాటు చేయడానికి వైసీపీ హయంలో శ్రీకారం చుట్టి పూర్తి చేశారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ నుంచి గండికోట మీదుగా త్వరగా కడప జిల్లాకు నీటిని మళ్లించేందుకు సిమెంట్ లైనింగ్ పనులను ఆగమేఘాల మీద పూర్తి చేశారు. 2021 సంవత్సరంలో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ సమీపంలోని గాలేరు హెడ్ రెగ్యులేటర్ వరకు 57 కిలోమీటర్ల వరకు మట్టికట్టతో ఉన్న గాలేరు నగరి కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులకు డీఎస్ఆర్, వీఏఆర్‌కెఎస్ కంపెనీలు జాయింట్ వెంచర్‌తో 57 కిలోమీటర్లకు 915 కోట్లతో టెండర్లను 2021 ఫిబ్రవరి నెలలో టెండర్లను దక్కించుకొని సిమెంట్ లైనింగ్ పనులు ప్రారంభించి పూర్తి చేశారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 57 కిలోమీటర్ల వరకు సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యాయి. అప్పట్లో గాలేరు నగరి కాల్వలో బోర్లు వేస్తామని, భూగర్భ జలాలు పెంచుతామని గత వైసీపీ ప్రభుత్వంలో హామీ ఇచ్చారు. ఆ హామీలకు తూట్లు పొడిచారు.

లైనింగ్ పనులు పూర్తయ్యాక తగ్గిపోయిన భూగర్భ జలాలు

సిమెంట్ లైనింగ్‌పనులు పూర్తికావడంతో బనగానపల్లె నియోజక వర్గంలో పలు చోట్ల భూగర్భజలాలు పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో సిమెంట్ లైనింగ్ వేయకముందు కరువు ప్రాంతమైన పాణ్యం, బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు మండలాల్లోని భూముల్లో భూగర్భ జలాలు పెరిగి పుష్కలంగా పండించుకునే వారు. కానీ రెండేళ్లుగా సిమెంట్ లైనింగ్ పనుల వల్ల భూగర్భ జలాలు తగ్గాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం కడప జిల్లాకు సాగు, తాగునీటిని మళ్లించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టి, పాణ్యం, బనగానపల్లె, అవుకు, సంజామల మండలాల ప్రజలకు అన్యాయం చేశారని విమర్శిస్తున్నారు. భూగర్భ జలాలు తగ్గడంతో బోర్లలో నీరు లేక రైతులు ఖరీఫ్ పంటలు వేయడంలేదు. గతంలో మట్టి కాల్వ ఉన్నప్పుడు భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో ఖరీప్ పంటలు సాగు చేసేవారు. షైనింగ్ వల్ల భూగర్భ జలాలు తగ్గిపోవడంతో రబీలో పంటల విస్తీర్ణం బాగా పడిపోయింది.

లైనింగ్ పనులు చేపట్టడం అన్యాయం



గాలేరు నగరి కాల్వలకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టడం దారుణం. ఈ పనుల వల్ల ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరుగుతున్నది. సాగు, తాగునీటికి ఇబ్బంది తప్పదు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోంది. కేవలం స్వార్థంతో కడప జిల్లాకు వరద నీటిని త్వరగా తరలించేందుకు ఈ ప్రాంత రైతులు, ప్రజలకు అన్యాయం చేసేందుకే లైనింగ్ పనులు చేస్తున్నారు.

-భూషన్న, జిల్లా టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి
పెద్దరాజుపాలెం

తీవ్రమైన తాగునీటి సమస్య



పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు మండలం అవుకు హెడ్ రెగ్యులేటర్ వరకు గాలేరునగరి కాల్వకు సిమెంట్ లైనింగ్ పనుల వల్ల ఈ ప్రాంత రైతులను అన్యాయం జరుగుతోంది. గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కడప జిల్లాకు త్వరగా వరదనీటిని త్వరగా తరలించుకోవాలనే స్వార్థంతో కర్నూలు జిల్లా రైతులకు అన్యాయం చేశారు. ఈ వేసవిలో తాగునీటి సమస్య తీవ్రమైంది.

-తిరుమలయ్య టీడీపీ నాయకుడు,
జోలాపురం గ్రామం బనగానపల్లె మండలం

బీసీ జనగణన జరిపించాలి



వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న బీసీ ఫెడరేషన్ చైర్మన్ తమ్మిశెట్టి చక్రవర్తి

- ప్రతి కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు మంజూరు చేయాలి
- ఏపీ బీసీ ఫెడరేషన్ చైర్మన్ తమ్మిశెట్టి చక్రవర్తి
- మహానందిలో ప్రత్యేక పూజలు

మహానంది, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీసీ జనగణన తప్పనిసరిగా జరిపించాలని ఏపీ బీసీ ఫెడరేషన్ చైర్మన్ తమ్మిశెట్టి చక్రవర్తి తెలిపారు. బుధవారం మహానంది క్షేత్రంలో ఆయన ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని కులాల కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి, ప్రతి కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు నిధులు మంజూరు చేసి బీసీల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఆలయాల పాలక మండలిలో వడ్డే, విశ్వబ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ, గంగపుత్రులకు స్థానం కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో స్కాలర్‌షిప్ విద్యార్థుల అకౌంట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవా లన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా బీసీ సమాఖ్య అధ్యక్షుడు మల్లేశ్వరుడు, వడ్డెర సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు చక్రధర్ పాల్గొన్నారు.

పులుల కోసం జింకలు

- తిరుపతి నుంచి నల్లమలకు 60 జింకలు : సబ్ డీఎఫ్‌వో



శ్రీనివాసరెడ్డి, సబ్ డీఎఫ్‌వో

రుద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సబ్ డివిజనులో నల్లమలలో ఉన్న పెద్దపులుల ఆహారం కోసం తిరుపతి నుంచి 60 జింకలను తెప్పిస్తున్నట్లు సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం రుద్రవరం సబ్ డీఎఫ్‌వో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పెద్దపులులకు ఆహారం కొరత లేకుండా చేసేందుకు ఫారెస్టుశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారన్నారు. నంద్యాల డివిజనులోని గుండ్ల బ్రహ్మేశ్వరం, చెలిమ, రుద్రవరం రేంజ్‌లలో పచ్చిక మైదానాలు ఉండడంతో శాకాహర జంతువులకు అనుకూలంగా ఉంటుందన్నారు. శాకాహర జంతువులు అధికం గా ఉన్నప్పుడే మాంసాహార జంతువులకు అడవి నిలయంగా ఉంటుంద న్నారు. వేసవిలో వన్య ప్రాణుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకు న్నామన్నారు. ఫైర్ వాచర్లను నియమించామని, నీటికుంటలు ఏర్పాటు చేశామన్నారు. రేంజర్ శ్రీపతి నాయుడు, సెక్షన్ ఆఫీసర్లు ముక్తర్‌బాషా, రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

అక్రమార్కులపై కేసు నమోదు చేయాలి: ఎంపీ బైరెడ్డి శబరి



అక్రమ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

పాణ్యం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమ రేషన్ బియ్యం నిల్వలపై బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ నాయుడు ఆధ్వర్యంలో ఎంపీ బైరెడ్డి శబరి చేసిన ఆకస్మిక దాడుల్లో 619 బియ్యం బస్తాలు పట్టుబడ్డాయి. పాణ్యం మండ లంలోని గోరుకల్లు తండాలోని ప్రభుత్వ గోడౌన్‌లో దాచిన 203 బస్తాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఎస్సార్బీసీ కాల్వ పక్కన ఉన్న ఒక షెడ్డులో 16 బస్తాలను, అలాగే తమ్మరాజుపల్లెలోని ఒక గోడౌన్‌లో దాచిన 400 రేషన్ బియ్యం బస్తాలను గుర్తించారు. అ క్రమ రేషన్ బియ్యాన్ని వెంటనే సీజ్ చేసి అక్రమార్కులపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల తీరు మారలేదన్నారు. ఐదేళ్లు దోచుకున్నా ఇంకా చాలలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తండాలో యథేచ్ఛగా ప్రభుత్వ గోడౌన్‌లో బియ్యం బస్తాలను రైతుల ధాన్యం మధ్య దాచి వ్యాపారం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అక్రమ బియ్యం వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ గోడౌన్‌లో దాచిన బియ్యం గురించి అధికారులు సమాచారం లేదనడం విచారకరమ న్నారు. ఈ బియ్యాన్ని తండాకు చెందిన లక్ష్మీనాయక్ దాచినట్లు తెలిపారు. తమ్మరాజుపల్లెలో రమణారెడ్డి అనే వ్యక్తి బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు తెలిపారు. వీఆర్వోలు బీరేంద్ర, వెంకటేష్, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రవికృష్ణకు రాష్ట్ర స్థాయి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ రవిక్రిష్ణ

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగ దినోత్సవం పురస్కరించుకొని నాటక కళారంగంలో సేవలు చేస్తున్న కృషికి గుర్తింపుగా కందుకూరి పుర స్కా రాలను బుధవారం విజయవాడలో అందించారు. డా. గుర్రాల రవిక్రిష్ణకు కం దుకూరి రాష్ట్రస్థాయి పురస్కారం దక్కింది. లక్ష రూపాయల నగదు, ప్రశం సాపత్రం, మెమెంటో, శాలువా ఇచ్చారు.

పీహెచ్‌సీల్లో.. వైద్యుల కొరత

- పలుచోట్ల విధుల్లో ఒక్కరే
- పని వేళలు పాటించని వైనం
- పడిగాపులు కాస్తున్న రోగులు
- పీజీ కోర్సుకు వెళ్లిన డాక్టర్లు
- నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు
- జిల్లాలో 19వైద్య పోస్టులు ఖాళీ
- త్వరలో ఖాళీలు భర్తీ చేస్తాం: డీఎంహెచ్‌వో వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైమరీ హెల్త్ సెంటర్స్ (పీహెచ్‌సీ)లో వైద్యుల కొరత వేధిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఒక్కొక్క పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించింది. జిల్లా వ్యాప్తంగా 59ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అయితే పలు ఆస్పత్రుల్లో ఒక్కరే వైద్యసేవలందిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో వైద్యులు పాల్గొనాల్సివస్తే ఆ రోజు ఆ పీహెచ్‌సీల్లో వైద్యసేవలకు సెలవు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామీణులకు వైద్యసేవలందక అవస్థలు పడుతున్నారు. అంతేకాక ఉన్న వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఆస్పత్రివద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యులు వస్తారా లేదా అన్న సమాచారం కూడా లేకపోవడంతో రోగులు నిరాశకు గురికావాల్సివస్తోంది. పీహెచ్‌సీల్లో ఉన్న వైద్యులు ఏదో ఒక పనిసాకుతో విధులకు డుమ్మాకొడుతున్నా అడిగేనాథుడే కరువయ్యాడు. నియమించిన వైద్యులు పీజీ చదువులకోసం వెళ్లడంతో ఆ పీహెచ్‌సీల్లో వైద్యుల పోస్టులు ఖాళీ అవుతున్నాయి. నంద్యాల జిల్లాలో మూడు డివిజన్లలో పీహెచ్‌సీలు పనిచేస్తున్నాయి. నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్లలో పీహెచ్‌సీలు ప్రజలకు వైద్యసేవలందిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 14మంది వైద్యాధికారులు పీజీ చదువుల కోసం వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. అలాగే మరో నాలుగు పోస్టులు భర్తీకాక ఖాళీగా ఉన్నాయి. గడివేముల



బండిఆత్మకూరు పీహెచ్‌సీ



గడివేముల పీహెచ్‌సీ

పీహెచ్‌సీలో డాక్టర్ ఏ.మనోజ్‌సందీప్‌ను నియమించినప్పటినుంచి ఇంతవరకు విధులకు హాజరుకాలేదు. దీంతో ఇక్కడ పోస్టు ఖాళీగా చూపుతున్నారు. ఆత్మకూరు డివిజన్‌లోని గోకవరం, నంద్యాల డివిజన్‌లోని ముత్యాలపాడు పీహెచ్‌సీల్లోని వైద్యులు ప్రసూతి సెలవులో ఉన్నారు.

వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్న పీహెచ్‌సీలు ఇవే..

జిల్లాలో ఆలమూరు, బ్రాహ్మణకొట్కూరు, చిన్నమల్కాపురం, దొర్నిపాడు, జలదుర్గం, కొట్టాలచెరువు, మద్దూరు, పగిద్యాల, ప్యాపిలి, పెద్ద యమ్మనూరు, ఆర్ఎస్ రంగాపురం, రేవనూరు, సంజామల, శిరివెళ్ల, ఉప్పలపాడు, కొత్తపల్లె, బేతంచెర్ల పీహెచ్‌సీల్లో ఒక్కొక్క వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉన్నాయి.

ప్రత్యామ్నాయంగా వైద్యులను నియమిస్తాం..



జిల్లాలో వైద్య పోస్టుల భర్తీకి నియామకాలు జరిగాయి. త్వరలోనే భర్తీ చేస్తాం. పీజీకి వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయంగా వైద్యులను నియమిస్తాం. సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటాం.

- డా.వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల

వాట్సాప్ గవర్నెన్స్‌తో పౌరసేవలు

- కలెక్టర్ రాజకుమారి



రాజకుమారి, కలెక్టర్

నంద్యాల నూనె పల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మనమిత్ర పేరుతో వా ట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని కలెక్టర్ రాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9552300009 వాట్సాప్ నెం బర్‌ను ప్రభుత్వం కేటాయించిందన్నారు. పౌరసేవలు అందించడంతోపాటు ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవ సరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. దీనిద్వారా 254పైగా సేవలు అందిస్తున్నారన్నారు. జూన్ నెలకు 500కుపైగా సేవలందిం చాలనే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పౌరులంతా తమ మొబైల్ ఫోన్‌లో మనమిత్ర పేరిట సూచించిన నెంబర్‌ను సేవ్ చేసుకోవాలని ఆమె సూచించారు. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఆదాయ, నో ఎర్నింగ్, వివిధ శాఖల ధృవపత్రాలను వాట్సాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు.

పాలిసెట్ దరఖాస్తుకు గడువు పెంపు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ దరఖాస్తుల స్వీకరణ గడువు నేటి వరకు పెంచినట్లు నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు పాలిసెట్-2025 దరఖాస్తు చివరి తేదీని గురువారం వరకు పొడిగించామన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ చేసే సమయంలో సమస్యలు ఎదురైతే హెల్ప్‌లైన్ సెంటర్స్‌ను సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.



మంత్రి కందుల దుర్గేష్ నుంచి అవార్డులు అందుకుంటున్న కళాకారులు జీవీ శ్రీనివాస రెడ్డి, ఎర్రమ పాండురంగయ్య, ఎంఆర్ రాధిక, గొండ్ల లక్ష్మన్న, మంజుల, నంద్యాలకు చెందిన రామసుబ్బయ్య, శంభు ప్రసాద్, రత్నకుమార్

జిల్లా కళాకారులకు కందుకూరి పురస్కారాలు

కర్నూలు కల్చరల్ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా, తెలుగునాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి కందుకూరి పురస్కారాలను జిల్లాకు చెందిన ఐదుగురికి ప్రదానం చేసింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం రాత్రి నిర్వహించిన కందుకూరి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రముఖ సినీ మాటల రచయిత బుర్ర సాయిమాధవ్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి నాయక్, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. జిల్లాకు చెందిన ప్రముఖ హార్మోనిస్టు ఎర్రమ పాండురంగయ్య, సీనియర్ రంగస్థల నటుడు జీవీ శ్రీనివాసరెడ్డి, గొండ్ల లక్ష్మన్న, రంగస్థల నటీమణులు ఎంఆర్ రాధిక, రామదుర్గం వనారస మంజుల పురస్కారాలు అందుకున్నారు. అవార్డులు అందుకున్న కళాకారులను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మియా అభినందించారు.

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కందుకూరి అవార్డును డాక్టర్ గుర్రాల రవికృష్ణ అందుకోగా, రంగస్థల సంగీత దర్శకుడు పిఎస్ రత్నకుమార్, సీనియర్ రంగస్థల నటుడు నంద్యాల జిల్లా గోస్పాడు మండలం దీబగుంట్లకు చెందిన మంతం శంభుప్రసాద్, బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లెకు చెందిన రామసుబ్బయ్యలు జిల్లా స్థాయి అవార్డులను అందుకున్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

• వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ల సంఖ్యాల బలం లేకపోయినా ఎమ్మెల్యే పార్థసారథి ప్రలోభాలకు గురి చేశారని, అయితే తమ కౌన్సిలర్లు ప్రలోభాలకు లొంగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ విజయబావుట ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సాయిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పార్థసారథి మున్సిపాలిటీకి రూ.4.5కోట్లు నిధులు తెచ్చానని అబద్ధాలు చెప్తారన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీన్నిటికీ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ కింద విడుదల చేసిన నిధులని, అవి తానే తెచ్చినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అనంతరం కౌన్సిలరులు అందరూ వారిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసీపీ రాష్ట్ర నాయకుడు తెర్నేకల్లు సురేంద్ర రెడ్డి పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్ రెడ్డి, లోకేశ్వరి, రాజేశ్వర్ రెడ్డి, బాలాజీ, ఫయాజ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



పెద్దయ్య (ఫైల్)

మంత్రాలయం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పులు అధికమై ఓ రైతు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంత్రాలయం మండలం సూగూరు గ్రామంలో జరిగింది. మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ బంధువులు తెలిపిన వివరాల మేరకు సూగూరు గ్రామానికి చెందిన కురువ పెద్దయ్య (65) అనే రైతు ఐదేళ్ల నుంచి తనకున్న రెండున్నర ఎకరాల్లో మిరప, పత్తి సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. గత మూడేళ్ల క్రితం పక్షవాతంతో మంచాన పడ్డాడు. పొలంలో పత్తి, మిరప వంటి పంటలు సరిగ్గా పెట్టుబడి రాక, అప్పులు తీర్చే దారి లేక మంగళవారం ఇంట్లో ప్రమాదకర ద్రావణం తాగాడు. ఇరుగు పొరుగు వారు భార్యాపిల్లలకు సమాచారం ఇచ్చారు. ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతునికి దాదాపు రూ.15 లక్షలు అప్పులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య వీరనాగమ్మ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి రైతు ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

పిడుగుపాటుతో మహిళ మృతి



రజియా (50)

చిప్పగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరులో పిడుగు పడటంతో రజియా (50)అనే మహిళ బుధవారం మరణించింది. ఏరూరులోని గ్రామ సచివాలయం వెనుక పొలంలో మిరపకాయలు వేరుచేస్తుండగా ఒక్కసారిగా వర్షం పడింది. ఇంటికి బయలు దేరుతుండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. హుస్సేన్ సాబ్ రజియా దంపతులకు ఆరుగురు సంతానం. పనిచేసి కుటుంబాన్ని నడుపుతున్న తల్లి మృతితో పిల్లలు, బంధువులు విలపించారు. జడ్పీటీసీ సంఘం మాజీ అధ్యక్షుడు మీనాక్షినాయుడు, ఏరూరు చౌదరి, దామన్న బాధితులను పరామర్శించారు

బంగారు నగలు మాయం

కర్నూలు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి వచ్చిన ఓ దంపతుల బంగారు ఆభరణాలు అదృశ్యం కావడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళగిరికి చెందిన శిరీష, నరసింహామూర్తి దంపతులు తమ బంధువులతో కలిసి ఈ నెల 12న కర్నూలులోని వెంకటరమణ కాలనీలో జరిగే ఓ పెళ్లికి హాజరయ్యారు. అదే రోజు నంద్యాల వెళ్లి అక్కడి నుంచి ట్రైన్‌లో విజయవాడ వెళ్లారు. 13వ తేదీ సాయంత్రం చూసుకుంటే ఆభరణాలు ఉన్న బ్యాగ్ జిప్ తెరిచి ఉంది. అందులో ఉన్న 30 తులాల బంగారు నగలు మాయమయ్యాయి. కర్నూలు వచ్చి విచారించుకున్నారు. టూటౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగరాజరావు తెలిపారు.

మోదీ కీలుబొమ్మలుగా దర్యాప్తు సంస్థలు

• నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

కల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ప్రధాన దర్యాప్తు సంస్థలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతిలో కీలుబొమ్మలుగా మారాయని నంద్యాల జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ మెంబర్ జే.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. బుధవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ హెరాల్డ్ కేసును కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజకీయ పరమైన అంశాలకు వాడుకుంటుందని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తుసంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీ, ఈసీ, ఐబీ, ఎన్‌సీబీ, సెబీ లను కేంద్ర ప్రభుత్వం పావులుగా ఉపయోగిస్తుందని విమర్శించారు. ముఖ్యంగా రాహుల్‌గాంధీకి దేశంలో పెరుగుతున్న ఇమేజీని తట్టుకోలేక ఈఅక్రమ కేసులు నమోదు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రముఖులైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై అక్రమ కేసులు ప్రజాస్వామ్య వ్యవస్థపై బీజేపీ చేస్తున్న దాడిలో భాగమేనన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా భయపడేది లేదని, ప్రజల మేలు కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పఠాన్ అబుఖాన్, నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుసేన్, షేక్‌రజాక్‌వలి, చెన్నయ్య, విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వాయర్లను నింపడంలో అధికారులు విఫలం

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ముగిసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు, న్యూసిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం కురిసిన వర్షాలకు ఉమ్మడి జిల్లాలో డ్యాంలో నీటి మట్టం పెరిగినా రిజర్వాయర్లు, చెరువులను నిపండంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జలవనరుల శాఖ అధికారులు చొరవ తీసుకుని అన్ని రిజర్వాయర్లను నింపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ మినీ సమావేశం భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈవో జి.నాసరరెడ్డి పర్యవేక్షించారు. రైతులకు రబీ,ఖరీఫ్ సీజన్లో నీరు అందించాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. కేసీ కెనాల్ కింద పంటలు ఎండిపోయినట్లు ఇటీవల కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలను చైర్మన్ అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఇంత జరుగుతున్న రైతులను ఎందుకు విస్మరిస్తున్నారని చైర్మన్ మండిపడ్డారు.

రేషన్ దుకాణాల నుంచి అన్ని రకాల నిత్యావసర వస్తువులు రావడం లేదని వెల్దుర్తి జడ్పీటీసీ సుంకన్న అన్నారు. తుగ్గలి మండలంలో మినీ గోకుల షెడ్లు కేవలం పచ్చచొక్క ఉన్నవారికే మంజూరు చేస్తున్నారని, పాడిపశువులు లేని వారికి కూడ ఎలా మంజూరు చేస్తారని జడ్పీటీసీ పులికొండ నాయక్ అధికారులను ప్రశ్నించారు. కర్నూలు నుంచి నంద్యాల వరకు జాతీయ రహదారికి ఇరువైపులా బస్‌షెల్టర్లు ఎందుకు ఏర్పాటు చేయలేదని జడ్పీటీసీ రంగనాథగౌడు ప్రశ్నించారు. గడివేముల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పక్కన రోడ్డు ని ఆక్రమించుకుని దుకాణాలు, భవనాలు నిర్మించారని తక్షణమే వాటిని తొలగించాలని గడివేముల జడ్పీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈవో వెంకట సుబ్బారెడ్డి, జడ్పీటీసీలు సుంకన్న, రంగనాథగౌడు, సుంకన్న పోచా జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్నించేవారే కరువు

జిల్లాలోని వివిధ మండలాల్లో నెలకొన్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన జడ్పీటీసీలు కరువయ్యారు. ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరగ్గా అందులో కోరం లేకుండానే సమావేశాలను మమ అనిపించారు. చివరికి కోరం లేకపోవడంతో 4,6 స్థాయి సంఘ సమావేశాలను సాయంత్రానికి వాయిదా వేసి తూతూ మంత్రంగా నిర్వహించారు.

దళితుల అభ్యున్నతే లక్ష్యం

- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దళితుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ అన్నా రు. బుధవారం మండలం లోని హుశేనాపురం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మరోసారి చంద్రబాబు రుజువు చేశార న్నారు. ఎస్సీ ఉప వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. గతంలో రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదికపై మంత్రులు వీటి ప్రకారం 200 పాయింట్ల రోస్టర్ అమలుకు నిర్ణయిం చిందన్నారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉప వర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉప కులాలకు ఒక శాతం, గ్రూపు-2లో 18 ఉప కులాలకు 6.5 శాతం, గ్రూపు-3లో 29 ఉప కులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఆమోదం తెలిపిందన్నారు. అన్ని జిల్లాలో ఈ ఆర్డినెన్స్ అమలులోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. నాటి ప్రభుత్వం జీవోను వ్యతిరేకిస్తూ మాలమహానాడు హైకోర్టులో కేసు వేయడంతో 1997 సెప్టెంబరు 16న హైకోర్టు నిలుపుదల చేస్తూ తీర్పునిచ్చిందన్నారు. ఈ జీవో ప్రభుత్వ భర్తికి మించిందని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ జీవో అమలును నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, గువ్వ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవాలు

• 20 నుంచి టీజీవీ కళాక్షేత్రంలో వేడుకలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సందర్భంగా కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో 'నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మియా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సాంస్కృతిక వారోత్సవాలు ఈనెల 20 నుంచి 26 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు వేసవి వినోద వల్లరిగా కొనసాగుతాయని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో ఆట, పాట, మాట, పద్యం పేర్లతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈనెల 20న కళారత్న ఆముదాల మురళిచే అష్టావధానం, 21న 'జగదేక సుందరి సామా' పద్య నాటక ప్రదర్శన (దర్శకత్వం పత్తి ఓబులయ్య), 22న 'శ్రీకృష్ణ కమలపాలిక' పద్య నాటక ప్రదర్శన (రచన దివంగత పల్లేటి కులశేఖర్, దర్శకత్వం పత్తి ఓబులయ్య), 23న 'తరమెల్లిపోతున్నది' సాంఘిక నాటక ప్రదర్శన (దర్శకత్వం కె. రామకృష్ణ, గుంటూరు), 24న 'సినిమా, జానపద, గజల్స్, సంగీత విభావరి' (నిర్వహణ సుధారాణి, మహమ్మద్ మియా), 25న 'శాస్త్రీయ, జానపద, నృత్యలహరి' ప్రదర్శనలు (నిర్వహణ నాట్యాచార్యులు ఎస్. కరీముల్లా, రోహిత్, ప్రదీప్, నారాయణస్వామి), 26న 'శ్రీవేంకటేశ్వర మహాత్యం' పౌరాణిక నాటకం (దర్శకత్వం వీవీ రమణారెడ్డి) ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియా వివరించారు.

అంతర్రాష్ట్ర డీజిల్ దొంగల ముఠా అరెస్టు



నిందితులు, డీజిల్, వాహనాలతో డీఎస్పీ హేమలత, పోలీసులు

• రూ.10లక్షలు, నాలుగు కార్లు స్వాధీనం
• 11 మంది అరెస్టు
• ఇద్దరు నిందితుల పరారీ
• వివరాలు వెల్లడించిన డీఎస్పీ హేమలత

ఆదోని , ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో పెట్రోల్ బంకుల వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీల్లో డీజిల్‌ను దొంగిలిస్తున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను ఆదోని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. డీఎస్పీ హేమలత, వన్ టౌన్ సీఐ శ్రీరామ్, టూటౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు.

పట్టణానికి చెందిన మైల రామకృష్ణ, సర్దార్ బాషా, సయ్యద్ సమీర్ డీజిల్ దొంగతనాలు చేస్తున్నారంటూ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2025 ఏప్రిల్ 8వ తేదీన ఫిర్యాదు చేశారు. నిలబెట్టిన లారీల డీజిల్ ట్యాంకు నుంచి వందల లీటర్లు, డీజిల్‌ను దొంగిలిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఆదోని వన్‌టౌన్‌లలో నాలుగు కేసులు, ఆదోని టూటౌన్‌లో ఒకటి ఆలూరులో ఒక కేసు నమోదయింది. ఫిర్యాదు స్వీకరించిన వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ డీజిల్ దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచి తనదైన శైలిలో దర్యాప్తును వేగవంతం చేశారు. తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లాకు చెందిన రమేష్ నాయక్ అలియాస్ చోటా నాయక్, దేగావత్ పాండు నాయక్, దేగావత్ పాపా నాయక్, దేగావత్ రవి నాయక్, దేగావత్ మహేష్ నాయక్, సభావాత్ కిషన్ నాయక్, పాల్తీయ రవి నాయక్, సభావత్ రవి నాయక్, చవాన్ సురేష్ నాయక్, కృష్ణా నాయక్, మహబూబ్ మండలానికి చెందిన రామావత్ రవికుమార్ రాథోడ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి దగ్గర నుంచి రూ.10.30లక్షల నగదును 350 లీటర్ల డీజీల్, నాలుగు ఫోర్‌వీలర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని చెప్పారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలానికి చెందిన బజారా మహేష్ నాయక్, వర్తియా రవి నాయక్‌,లులో భాస్కర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎనిమిదేళ్ల నుంచి ఈ ముఠా డీజల్ దొంగతనాలు చేస్తూ జల్సాలు చేస్తున్నారని తెలిపారు. సీసీ పుటేజీల ద్వారా చిన్న క్లూ దొరికిందని, తీగ లాగితే దొంగ కదలినట్లు పెద్ద ముఠానే దొరికిందన్నారు. వారిని పట్టుకుని విచారించగా డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నామని అంగీకరించారన్నారు. దీంతో వారి నుంచి రూ.10.30 లక్షలతో పాటు 350 లీటర్ల డీజిల్, 10 ఖాళీ క్యాన్లను, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ హేమలత తెలిపారు. సీఐ శ్రీరామ్, సిబ్బందిని అభినందిం చారు. ఎస్పీ చేతులమీదుగా రివార్డు అందజేసేందుకు సిఫారసు చేస్తానని డీఎస్పీ అన్నారు.

'సదరం'లో సౌకర్యాల కొరత

- ఎండకు ఇబ్బందులు పడ్డ దివ్యాంగులు
- వైద్యుల కోసం పడిగాపులు



వైద్యుల కోసం నిరీక్షణ



ఎండకు ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం వెరిఫికేషన్ శిబిరంలో దివ్యాంగులకు ఆరకొర వసతులు ఏర్పాటుచేయడంతో అవస్థలు పడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు కనీసం కూర్చునేందుకు కుర్చీలు, నీడ లేకపోవడంతో మండుటెండలో వెరిఫికేషన్ కోసం వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం నిర్వహించిన సదరం క్యాంపులో దివ్యాంగుల అవస్థలు ఆంధ్రజ్యోతి కంటపడ్డాయి. ప్రతివారం బుధ, గురు, శుక్రవారాల్లో జిల్లావ్యాప్తంగా దివ్యాంగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం సదరం క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు 240 మంది శిబిరానికి వస్తుంటారు. కాగా జిల్లా నలుమూలలనుంచి వస్తున్న దివ్యాంగులకు సరైన సౌకర్యాలు కల్పించలేదని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మానసిక వైద్యుడు ఉదయం 10:45కు హాజరయ్యారు. దివ్యాంగులకు ఇచ్చిన నోటీసులు ఉదయం 9గంటలకు హాజరు కావాలని, ఇచ్చిన సమయంలో హాజరు కాకపోతే సర్టిఫికెట్ రద్దు చేస్తామని నవిలాయం సిబ్బంది స్పష్టం చేశారు. అధికస్థం మీద సుదూర ప్రాంతాలనుంచి వస్తున్న దివ్యాంగులకు సరైన సౌకర్యాలు కల్పించాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడ్డాం



మానసిక వైద్యుడు సమయానికి రాకపోవడంతో ఇద్దరు పిల్లలతో ఇబ్బందులు పడ్డాం. పుట్టిన ఇద్దరు పిల్లలు మానసిక దివ్యాంగులే. కుటుంబ పోషణ, మరొకరికి 75శాతం మానసిక వైకల్యం ఉన్నట్లు గతంలో సర్టిఫికెట్లు ఇచ్చారు. బేతంచెర్ల మండలం సంకలాపురం గ్రామం నుంచి ఉదయమే శిబిరానికి వచ్చాం.

- పెద్దబుజ్జన్న, సంకలాపురం

పార్టీ కోసం పనిచేసే వారికి న్యాయం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసే వారికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. జూపాడుబంగ్లాలోని వెంకటేశ్వరాలయం ఆవరణలో బుధవారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందు నుంచి టీడీపీ జెండా మోసిన నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గిరీశ్వరరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో వేరే పార్టీ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని, యువగళం పాదయాత్ర సమయంలో టీడీపీ కార్యకర్తలను అడ్డుకున్న వారికి అందలం ఎక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరుగకుండా పార్టీ అధ్యక్షుడు పనిచేస్తున్నారని, కార్యకర్తల సమావేశం తమ సమస్యలు చెప్పుకుంటే పార్టీ దృష్టికి తీసుకెళతామని అన్నారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దళితులందరికీ సమానంగా రిజర్వేషన్లు'

దళితులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని రిజర్వేషన్లు మూడు విభాగాలుగా మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. జూపాడుబంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం జరిగే డీఎస్సీతో పాటు, విద్యా, ఉపాధి అవకాశాల్లో కూడా ఆ ప్రకారం రిజర్వేషన్లు కల్పించడం దళితులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదు మండలాలకు త్వరలో వాటర్‌గ్రిడ్‌ను అమలు చేసి ఇంటింటికీ కొళాయిల ద్వారా రక్షిత తాగు నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కేసీ కాలువ అధికారులు గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, ఏవో కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, గిరీశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, వరమేశ్వరరెడ్డి, పెద్దన్న, బాలమద్దిలేటి, బాలయ్య పాల్గొన్నారు.

భక్తురాలికి పర్సు అప్పగింత

- నిజాయితీ చాటుకున్న మహానంది ఆలయ అర్చకుడు

మహానంది, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ అర్చకుడు వనిపెంట ప్రకాశం శర్మ తనకు దొరికిన పర్సును తిరిగి భక్తురాలికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. బుధవారం బెంగళూరుకు చెందిన ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులతో కలసి మహానంది క్షేత్రానికి వచ్చారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించుకున్న భక్తురాలు రెండవ ప్రాకారంలోని రాహుకేతువు మంటపం వద్ద పర్సును మరచిపోయారు. అటువైపు వెళ్తున్న అర్చకుడు ప్రకాశం శర్మ గుర్తించారు. దేవస్థానం మైకు ద్వారా తనకు పర్సు విషయాన్ని సమాచారం అందించారు. బాధితురాలు ఆనవాళ్లు చెప్పడంతో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య చేతుల మీదుగా భక్తురాలు ఆదిలక్ష్మికి పర్సును అప్పగించారు. అందులో రూ.10,700 నగదు ఉన్నట్లు గుర్తించారు.

విద్యార్థులకు ఉద్యోగాలు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నేషనల్ డిగ్రీ కళాశాలకు చెందిన చివరి సంవత్సరం విద్యార్థులు 70 మంది ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఇంతియాజ్‌అహ్మద్ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు.

ఏఐఎంఎల్ ల్యాబ్ ప్రారంభం

పాణ్యం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఏఐఎంఎల్ (ఆర్టిఫిషియల్ ఇంటలి జెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్)ను కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు ప్రారంభించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

పాణ్యం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీన భూపన పాడు చెరువులో ప్రమాదవశాత్తు కాలుజారి పడిన బొగ్గరి వెంకటేశ్వర్లు మృతదేహం బుధవారం లభ్యమైనట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. దాహం తీర్చుకోవడానికి వెళ్లిన వెంకటేశ్వర్లు కాలుజారి పడి గల్లంతైనట్లు తెలిపారు. వెంకటేశ్వర్లుకు భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమారులు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి

నంద్యాల రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణను ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో బుధవారం మైనార్టీ ప్రజాసంఘాలు, ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, ముస్లిం జేఏసీ నాయకులు ఎంఐఎం, సీపీఎం, సీపీఐ వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

గడివేముల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపాడు గ్రామంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బుధవారం పాణ్యం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బీవీఎస్ రాజు సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త తప్పనిసరిగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.

డ్రైనేజీలు నిర్మించాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్ కాలనీలో డ్రైనేజీలు నిర్మించాలని సీపీఎం నాయకులు రణధీర్, పీకీనాస్వాంబ్ కోరారు. బుధవారం 9వ నవిలాయలు వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలనీలో సరైన డ్రైనేజీ సదుపాయం లేకపోవడం వల్ల వర్షాకాలంలో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇళ్లలోకి నీరు రావడంతో అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. నాయకులు గణపతి, చిన్నవలి, పారూక్‌తో పాటు కాలనీవాసులు ఉన్నారు.

గ్రామాలకు మహర్దశ: ఎమ్మెల్యే



వెంకటాపురంలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ చేకూరిందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలంలోని కరివేనలో రూ.2.25కోట్లు, నల్లకాల్వలో రూ.20లక్షలు, వెంకటాపురంలో రూ.45లక్షలు, వడ్లరామాపురంలో రూ.35లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని అన్నారు. హామీలన్నీ తప్పక అమలు చేసి తీరుతామన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ రాజ్ ఏఈ సుబ్బయ్య, ఎంపీపీ తిరుపాలమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి, జనసేన పార్టీ నాయకులు కర్నాటి శ్రీరాములు, ఆయా గ్రామాల సర్పంచులు మహానందిగౌడ్, వెంకటరమణ, బాలకృష్ణయ్య, నాయ కులు రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఏలిషా, రమేష్, గోవర్ధన్‌రెడ్డి, కొండలరాయ, రవినాయక్, దినకర్, శరత్, శేషన్న, చిన్న, లింగస్వామి ఉన్నారు.

కరివేనలో వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, హౌసింగ్, ఇళ్లస్థలాలకు సంబంధించి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రతివారం ప్రతిష్ఠాత్మకంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో న్యాయాధికారి



న్యాయాధికారికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

మహానంది, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో బుధవారం నంద్యాల జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయంలోకితెల్లవారుజామున జరిపే ప్రాతఃకాల హారతి సేవలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకాభిషేక పూజలను జరిపారు. కళ్యాణ మంటపంలో వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి వారి మెమెంటోను ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

లక్ష్మీరంగనాథ స్వామికి పూజలు



ఎంపీ శబరికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్తూరు జాతర సందర్భంగా లక్ష్మీరంగనాథ స్వామికి నంద్యాల ఎంపీ శబరి బుధవారం పూజలు చేశారు. ముందుగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు పట్టువస్త్రంతో సత్కరించారు. గ్రామంలో ఎంపీ నిధులు రూ. 5లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంపీ ప్రారంభించారు. టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, నాగిరెడ్డి, శివరామకృష్ణారెడ్డి, శివానందరెడ్డి, సైపుల్లాసిద్ధుసుధాకర్, చంద్రుడు, బాలనారాయణగౌడు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం వైద్యశాల తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఈవో

శ్రీశైలం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత వైద్యశాలను బుధవారం ఈవో ఎం.శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యశాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసర సమయంలో రోగులను తరలించేదుకు అంబులెన్సులు అందుబాటులో ఉండాలని, వైద్యశాల రికార్డుల కంప్యూటీకరణకు సాఫ్ట్‌వేర్ రూపొందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆక్సిజన్ సిలిండర్ల కొరత లేకుండా చూసుకోవాలని, వైద్యశాలలోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరానికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్యశాల ముందు భాగంలో షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం ఈఈ నరసింహారెడ్డి, వీఈఓ ఆర్ టి. శ్రీనివాసరావు, పర్యవేక్షకులు రవి, డాక్టర్ పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్ బాషా

నంద్యాల క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని నంద్యాల బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కె.హుస్సేన్ బాషా అన్నారు. బుధవారం నంద్యాల బార్ అసోసియేషన్ గత పాలక మండలికి వీడ్కోలు పలుకుతూ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం ఆధ్వర్యంలో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రధాన కార్యదర్శి ముక్కెర కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, కోశాధికారి ఎస్.మద్దిలేటిరెడ్డి, జాయింట్ సెక్రటరీ విజయనాయక్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ డి.చిన్నలింగయ్య, లైబ్రేరియన్ సెక్రటరీ జి.మద్దిలేటి యాదవ్, మహిళా ప్రతినిధి సౌజన్యతోపాటు సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సీనియర్, జూనియర్ న్యాయవాదులు సన్మానించారు.

'పైపులైన్ పనులను నిలిపివేయాలి'



నందికొట్కూరులో మానవహారం చేస్తున్న జేఏసీ నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు పరిశ్రమలు హబ్‌కు తీసుకెళ్తున్న పైపులైన్ పనులను నందికొట్కూరు పట్టణంలో నిలిపివేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తూ చేపట్టిన పట్టణ బంద్‌ను నందికొట్కూరు వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బుధవారం జేఏసీ నాయకులు నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి బయలుదేరి పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆటోలను నిలిపివేసి పటేల్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జేఏసీ నాయకులు నాగేశ్వరరావు, కౌన్సిలర్ చాంద్‌బాషా, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతంలో పైపులైన్లను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని, ఆ దిశగా ఎంపీ డా.బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, స్థానిక నాయకులు ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. జేఏసీ నాయకులు రమూరామ్మూర్తి, నరసింహులు, అల్లాబ రమేష్, మన్సూర్, గౌరీ గణేష్, అచ్చెన్న, తిక్కయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పక్కీర్ సాహెబ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విచారణ

మహానంది, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలో ఉన్న అరటి తోటలో మూడు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో పడి ఉన్న మృతుడిని మండలంలోని తమ్మడపల్లి వాసి అయిన్‌షెట్టు సమా చారం. తమ్మడపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు మూడు రోజుల నుంచి కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీశారు. అయితే మృతుడు బుక్కాపురంగ్రామ సమీపంలో ఆటో ఎక్కి మహానంది తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆటో దిగినట్లు మహానంది పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా సమాచారాన్ని సేకరించారు. ఎస్ఐ రామ్మో హన్‌రెడ్డిని వివరణ కోరగా మృతుడు తమ్మడపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అని కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మృతుని ఆధారా లను పరిశీలిస్తే నిర్ధారణకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

నేడు టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

ఆత్మకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మంటపంలో ఉదయం 10 గంటలకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి నేతృత్వంలో శ్రీశైలం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గాల నుంచి ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్లు యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, కుటుంబ సాధికారత కమిటీ సభ్యులతో పాటు టీడీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరు కానున్నారు.

వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ ఫసిపిల్ మున్నా

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి సహకారంతో ఆత్మకూరు పట్టణంలోని కేజీకే స్టేడియంలో మే 1 నుంచి 30 వ తేది వరకు నిర్వహించే వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ ఫసిపిల్ మున్నా సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..ఈ సమ్మర్ క్యాంప్ శిక్షణ శిబిరంలో నెల రోజుల పాటు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బాక్సింగ్, బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, ఖోఖో క్రీడల్లో కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాన్‌లోకల్ క్రీడాకారులకు ఈ శిక్షణలో భాగంగా హాస్టల్ వసతి సైతం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలకు అనుమతులు కల్పించి ఈ సదవకాశాన్ని కల్పించినందుకు రాష్ట్ర క్రీడా చైర్మన్ రవినాయుడు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నాయబ్ సయ్యద్ అసదుల్లా, ఖోఖో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు టైగర్ బాబు, మహబూబ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సున్నిపెంట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం సున్నిపెంటలోని ఫైర్ స్టేషన్ వద్ద శ్రీశైలంలోని కొత్తపేటలో ఫైర్ ఆఫీసర్ శివ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, ఎలా నివారించాలో ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆత్మకూరు: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నియంత్రించవచ్చని అగ్నిమాపక కేంద్రం అధికారి భీమునాయక్ పేర్కొన్నారు. బుధవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించి అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. ఆ తర్వాత ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మోహన్‌రాజు, జిలానీ, సుబ్బయ్య, రఫీక్, అన్వర్ ఉన్నారు.

కొత్తపల్లి ఎస్ఐగా జయశేఖర్



కొత్తపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఎస్ఐగా జయశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆదోని త్రీటౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీలో భాగంగా కొత్తపల్లి ఎస్ఐగా జయశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కేశవ గత పదిహేను రోజుల క్రితమే నందవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

హామీలను నెరవేర్చాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగన్న, నాగరాజు, తిమ్మయ్య, సువర్ణమ్మలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఓబులేసునాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు గౌడుగు రాజు, జోసెఫ్, జయన్న, దేవమ్మ, మరియమ్మ, మస్తెమ్మ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్‌పై ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది నంద్యాల పట్టణంలో బుధవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మాదకద్రవ్యాలను సమూలంగా నిర్మూలించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో ఇప్పటికే ఈగల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేయడం కోసం ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక క్యూఆర్ కోడ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో మాదకద్రవ్యాలైన డ్రగ్స్, గంజాయి తదితర వాటిని అక్రమంగా పండిస్తున్న, విక్రయిస్తున్న, వినియోగిస్తున్న సమాచారం ప్రజలనుంచి ప్రభుత్వం తెలుసుకునేం దుకు ఈ క్యూఆర్‌కోడ్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్యూఆర్ కోడ్‌లను పోలీస్ స్టేషన్లు, ముఖ్యమైన కూడళ్లలో అతికించారు. ప్రజలు ఈ క్యూఆర్ కోడ్‌లను స్కాన్‌చేసిన తర్వాత ఆయా ప్రాంతాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించి చిన్న సమాచారం తెలుసుకునేందుకు కొన్ని అంశాలపై ప్రశ్నలు వస్తాయని, ప్రజలు తమ అభిప్రాయాలను అందులో తెలియజేయాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

భూముల పరిశీలన



బానుముక్కల శివారులో భూములను పరిశీలిస్తున్న విద్యుత్ డీఈ

పాములపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానుముక్కల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించినట్లు విద్యుత్‌శాఖ డీఈ రామ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం వీఆర్‌ఓతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 408లో 180 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో సోలార్ ప్రాజెక్టు నిర్మించ కోసేందుకు అనుమతులు కోరామని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న ఆ భూమిని వెలుగోడు జలాశయం నిర్మాణం కోసం మట్టి అవసరాలకు ప్రభుత్వం రైతుల నుంచి భూమి కొనుగోలు చేసిందని, ఆ భూమి నేడు ఇరిగేషన్ ఆధీనంలో ఉందని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న భూమిని సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేటాయించేలా కలెక్టర్ ద్వారా ఇరిగేషన్ అధికారులను కోరనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న వైద్యాధికారి తిరుపతి

మిడుతూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారులు తిరుపతి, యోమసేను అన్నారు. సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుక ఆధ్వర్యంలో మిడుతూరు, కడుమూరు గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రంగస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ ఏసేప్ప, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మరమ్మతులకు మోక్షమెన్నడో!

చెరువుల్లో తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం

- శిథిలావస్థలో పంట కాలువలు
- ఆయకట్టుకు అందని నీళ్లు
- ఆందోళనలో రైతన్నలు


నీరు లేక ఎండిపోయిన డి.వనిపెంట చెరువు

చాగలమర్రి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి ఊట చెరువులు ఒట్టి చెరువులుగా మారుతున్నాయి. నీటి వనరులు తక్కువగా ఉండే ప్రాంతాల్లో చెరువుల మీద ఆధారపడి వ్యవసాయం సాగేది. అయితే రాను రాను చెరువుల్లో నీటి నిల్వ తగ్గిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువుల్లో పూడిక పెరగడం, తూములు, పంట కాలువలు, మట్టి కట్టలు బలహీనంగా ఉండటంతో ఆశించిన మేర పంట పొలాలకు నీరందడం లేదు. ఆళ్లగడ్డ మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో 26 చెరువులు ఉన్నాయి. చాగలమర్రి మండలంలో డి.వనిపెంట, ముత్యాలపాడు, చింతలచెరువు, తోడెండ్లపల్లెలో చెరువులు ఉన్నాయి. చింతల చెరువు కింద 250 ఎకరాలు, ముత్యాలపాడు చెరువు కింద ఖరీఫ్‌లో 550 ఎకరాలు, రబీలో 270 ఎకరాలు, డి.వనిపెంట చెరువు కింద ఖరీఫ్‌లో 900 ఎకరాలు, రబీలో 400 ఎకరాలు, తోడెండ్లపల్లె చెరువు కింద 100 ఎకరాలు, తిప్పనపల్లె చెరువు కింద 600 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. చెరువులకు మంజూరయ్యే నిధులతో తాత్కాలిక పనులు చేపట్టి అధికారులు, కాంట్రాక్టర్లు చేతులు దులుపుకుంటున్నారు. తోడెండ్లపల్లె గ్రామంలోని చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైంది. చెరువులో నీరు లేకపోవడంతో బోర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఆయా చెరువుల్లో రబ్బరు చెట్లు, పూడిక పెరిగిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది.

శిథిలావస్థలో పంట కాలువలు

మండలంలోని చెరువుల ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే పంట కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పంట కాలువల డిస్ట్రిబ్యూటర్లు దెబ్బతిన్నాయి. ముత్యాలపాడు, డి.వనిపెంట, చింతలచెరువు, తిప్పనపల్లె చెరువుల ద్వారా నీరందించే పంట కాలువలు పూడిపోవడంతో చెరువుల ద్వారా చివరి ఆయకట్టుకు చుక్కనీరందడం లేదు. వర్షాకాలంలో చెరువులకు నీరు నింపుతున్న పంట కాలువలు లేకపోవడంతో ఆయకట్టుకు నీరందడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి చెరువుల మరమ్మతులు, పంట కాలువల పనులు చేపట్టి ఆయకట్టుకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.


శిథిలావస్థలో చెరువు డిస్ట్రిబ్యూటరీ

పనులు చేపట్టాలి



వర్షాకాలంలో చెరువులు నిండుతున్నా ఆయకట్టుకు నీరందదు. చెరువుల్లో నుంచి పంట పొలాలకు అందించే కాల్వలు దెబ్బతిన్నాయి. ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పంట కాలువ పనులు చేపట్టి నీరందేలా చూడాలి.

- వీరయ్య, రైతు, డి.వనిపెంట

నామమాత్రంగా మరమ్మతులు..



చెరువుల్లో మరమ్మతులు చేపట్టక పోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. ఈ ఏడాదైన చెరువు మరమ్మతు పనులు చేపట్టి నీరందించేలా చూడాలి.

- బాబునాయుడు, రైతు, డి.వనిపెంట

చెంచులకు ఉపాధి ఫలాలు అందించాలి


డీటీకి వినతిపత్రం అందిస్తున్న చెంచులు, సీపీఎం జిల్లా నాయకులు

రుద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉపాధి ఫలాలు అందడం లేదని చెంచులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో చిన్నయ్యస్వామి చెంచుగూడెం చెంచులు డీటీ చంద్రశేఖరయ్యకు వినతిపత్రం అందించారు. చెంచులు మాట్లాడుతూ 2005లో 24 చెంచుకుటుంబాలకు 32 ఎకరాల భూమిని ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఆ భూముల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా, సాగునీరు లేక ఎండిపోయిందని వాపోయారు. మరో వైపు ఉన్న పంటలపై అడవి పందులు దాడిచేసి నాశనం చేశాయన్నారు. ఉపాధి పనులకు వెళ్లేందుకు జాబ్‌కార్డులు లేవని, ఇప్పించాలని కోరారు. సీపీఎం జిల్లా నాయకుడు రామచంద్రుడు మాట్లాడుతూ చెంచుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన సదస్సు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో మహబూబ్‌ఖాన్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వైపరీత్యాలపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనుకోని ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, వ్యవసాయశాఖ ఏవో కిశోర్ కుమార్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరిమ్మ పాల్గొన్నారు.

శేషవాహనంపై చెన్నకేశవస్వామి

బేతంచెర్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌరిపేట ఆంజనేయస్వామి దేవాలయంలో వెలసిన శ్రీదేవి భూదేవి చెన్నకేశవ స్వామి తిరునాళ్ల మహోత్సవాలను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం చెన్నకేశవస్వామి శేషవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఆయా వీధుల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఈవీ సుజాతశర్మ, శ్రీధర్ రెడ్డి, మారుతి శర్మ, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

హెడ్ పోస్టుమాస్టర్ పద్మావతమ్మకు పురస్కారం


పద్మావతమ్మకు జ్ఞాపికను అందజేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

డోన్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): డోన్ హెడ్ పోస్టుమాస్టర్ పద్మావతమ్మకు పోస్టల్ రాష్ట్ర స్థాయి పురస్కారం వరించింది. తిరుపతి లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉద్యోగ పురస్కారం కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ఇందులో భాగంగా బుధవారం డోన్ హెడ్ పోస్టాఫీసులోఉద్యోగ సంఘాల మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలా లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించా రు. ఇన్‌చార్జి పోస్టుమాస్టర్ నాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బనగానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌గా కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి



బనగానపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌గా కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డిని నియమిస్తూ టీడీపీ అధిష్టానం తాజాగా జాబితాను విడుదల చేసింది. తొలి జాబితాలో కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డికి స్థానం దక్కింది. బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండలం చెన్నంపల్లెకు చెందిన కాట్రెడ్డి మల్లిఖా ర్జునరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో అవుకు మండలంలో క్రియాశీలకంగా పనిచేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపునకు కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి మార్కెట్‌యార్డు చైర్మన్ గిరి లభించింది. తనను బన గానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమించడానికి సహకరించిన రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బనగానపల్లె మార్కెట్‌యార్డు అభివృద్ధికి తనవంతు సేవలందించి అభి వృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. రైతులకు తనవంతు సహకారాలు అందిస్తానన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

ప్యాపిలి ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పని వేళల్లో వైద్యులు రోగులకు అందు బాటులో ఉండాలని అదనపు జిల్లా వైద్యాధికారి శారదాబాయి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శారదాబాయి మాట్లాడుతూ సమయ పాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అడవి పందుల బెడద

- మొక్కజొన్న పంటను నాశనం చేస్తున్న వైనం
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు


పొలం చుట్టూ చీరలు కట్టిన రైతులు

ప్యాపిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల బెడద తీవ్రంగా మారింది. రాత్రిపూజ పొలాల్లోకి వచ్చి మొక్కజొన్న పంటను నాశనం చేస్తున్నాయి. దీంతో రూ.వేలకు వేలకు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట నాశనం అవుతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలోని ఊటకొండ, గోపాల్‌నగరం, మాధవరం, జలదుర్గం, రామక్రిష్ణాపురం తదితర గ్రామాల్లో రైతులు దాదాపు 300 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఎకరాలకు రూ.40వేలకు పైగా పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేశారు. ఆరుగాలం కష్టపడి పంటను కాపాడుకున్నారు. అయితే పంటకు అడవి పందుల బెడద రైతుల కంటికి కునుకు లేకుంగా చేస్తున్నాయి. పందుల నుంచి రక్షించుకోవడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారు. కర్నూల, అనంతపురం ప్రాంతాలకు వెళ్లి పాత చీరలను కొనుగోలు చేసి పొలం చుట్టూ కడుతున్నారు. అలాగే రాత్రి సమయంలో పందుల బెడద తగ్గడానికి బాణా సంచా కాలుస్తున్నారు. అయినా పందుల బెడ ద దగ్గడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి అడవి పందుల బారినుంచి పంటలను కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ముర్తుజావలి

బేతంచెర్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని లేకపోతే న్యాయ పోరాటం చేస్తామని వైసీపీ ముస్లిం మైనార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ముర్తుజావలి అన్నారు. బుధవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో నగర పంచాయతీ కన్వీనర్ పిట్టల జాకీర్ అధ్యక్షత ముస్లింలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తచట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో వైసీపీ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. వక్ఫ్ చట్టం 1995లో మార్పులు చేస్తూ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన సవరణలు రాజ్యాంగబద్ధంగా చేయకపోవడంతో ఒక మతాన్ని వివక్షతన చేసే విధంగా కొత్త చట్టం తీసుకరావడం సరికాదన్నారు. ఆర్టికల్ 14, 15లను ఉల్లంఘిస్తూ చేసిన సవరణలు రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. సమావేశంలో ఖాజా హుశేన్, సాధిక్ హుశేన్, శాలిబేగ్, ముస్లింలు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి 'కందుకూరి' కృషి

బనగాన పల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. బుధవారం పలుకూరు గ్రామంలో కందుకూరు వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలహనుమంతు, బాలన్న, నరసింహులు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి: పీడీ

బనగానపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సూపర్ వైజర్లు విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఐసీడీఎస్ పీడీ లీలావతి ఆదేశించారు. బుధవారం బనగానపల్లె ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఐసీడీఎస్‌కు సంబంధించిన యాప్‌లు ఎలా ఉపయోగిస్తున్నారన్న విషయంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విధులు సక్రమంగా నిర్వర్తించేలా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమం లో బనగానపల్లె ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ, సూపర్ వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు

ట్రాక్టర్ ఇంజన్ చోరీ

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిశెట్టిపల్లె సమీపంలో ఉన్న రైస్ మిల్ వద్ద పార్కింగ్ చేసిన ట్రాక్టర్ ఇంజన్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండుగులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు బుధవారం వెల్లడించారు. సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన దస్తగిరమ్మ, కుమారుడు రైస్‌మిల్ వద్ద ట్రాక్టరు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే దినచర్యలో భాగంగా మంగళవారం పని ముగించిన తరువాత రైస్‌మిల్ వద్ద పార్కు చేసి ఉండగా, బుధవారం తెల్లవారేసరికి ట్రాక్టర్ ఇంజన్ కనిపించలేదన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం


కప్పలవాగు బ్రిడ్జికి పక్కన వేస్తున్న తాత్కాలిక రహదారి

కొవెలకుంట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వల్లంపాడు గ్రామ పక్కనే ఉన్న ప్రధాన రహదారిలోని కప్పల వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు బుధవారం ప్రారంభ మయ్యాయి. సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి సమస్యను మంత్రి దృష్టికి తీసుకవెళ్లడంతో స్పందించి రూ.కోటి 50లక్షల నిధులు మంజూరు చేయించారు. దాంతో నూతన బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా బుధవారం బ్రిడ్జినిర్మాణ పనులు చేపట్టేందుకు పక్కనే పొలాల్లో టిప్పర్ల ద్వారా గ్రావెల్ వేసి ప్రత్యామ్నాయంగా రహదారి ఏర్పాటు చేయించారు. అనంతరం బ్రిడ్జినిర్మాణ పనులు చేపడతారని సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆయకట్టు విస్తీర్ణం గుర్తించాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏడవ చిన్న తరహా నీటి గణనపై సంబంధిత అధికారులు ఆయకట్టు విస్తీర్ణం, బోర్లు, బావులు, రిజర్వాయర్లు, కుంటలు, చెరువులు ఎన్ని ఉన్నాయో.. ఆయకట్టు విస్తీర్ణం గుర్తించాలని జిల్లా ముఖ్య ప్రణాళిక స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగమణి ఆధ్వర్యంలో వీఆర్వోలకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజా, ఏఎస్‌వో మునిస్వామి, ఆర్ఐ మస్తాన్, వీఆర్వోలు మల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, మనోహర్, కృష్ణమూర్తి, గోవిందు, భాస్కర్ నాయుడు, వెంకట్రాముడు, ఖాజా, లాలెప్ప, మాధవస్వామి, రామాంజనేయులు, మహేశ్వరి, పెద్దక్క పాల్గొన్నారు.

షెడ్యూల్ విడుదల

డోన్ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఆర్‌టీఈ యాక్ట్-2009 ప్రకారం పేద విద్యార్థులకు 2025-26 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు లాటరీ పద్ధతిలో కేటాయించుటకు షెడ్యూల్ విడుదల అయినట్లు ఎంఈవో ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు, దివ్యాంగులకు ఐదుశాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీకు 4శాతం, బీసీ, మైనార్టీల విద్యార్థులకు ఆరుశాతం సీట్లు ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రక్రియ ఈ నెల 19 నుంచి 26 వరకు ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంచనాల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియా

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన అంచనాల కమిటీ సమావేశంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, అంచనాల కమిటీ సభ్యురాలు భూమా అఖిలప్రియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమా అఖిలప్రియా మాట్లాడుతూ అంచనాల కమిటీ ద్వారా అమలు పర చాల్సిన అంశాలను గురించి సమీక్షించారు. సమావేశంలో సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్, అంచనాల కమిటీ చైర్మన్ , సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): యు.కొత్తపల్లి, మల్యాల విద్యుత్ సబ్ స్టేషన్ల మధ్య 33 కేవీ మరమ్మతుల కారణంగా గుండాల విద్యుత్ సబ్ స్టేషన్, దేవరబండ సబ్‌స్టేషన్లకు గురువారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అల్ట్రాటెక్ పరిశ్రమ తనిఖీ



తిమ్మనాయినిపేట పల్లె నిద్రలో పాల్గొన్న డీఎస్పీ

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ సిమెంట్ ఉత్పత్తి కంపెనీ అల్ట్రాటెక్ పరిశ్రమను ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అల్ట్రాటెక్ పరిశ్రమ ఆయుధ కార్మాగారం, రికార్డులను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలు, సెక్యూరిటీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది వున్నారు. అలాగే తిమ్మనాయినిపేటలో ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్, కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు బుధవారం పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలందరూ కలిసిమెలసి జీవించాలని సూచించారు.

చేతిపంపుల పరికరాలు కొనుగోలు

రుద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలానికి రూ.4.5లక్షలతో చేతిపంపుల పరికరాలు కొనుగోలు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

కొవెలకుంట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కొవెలకుంట్ల పట్టణ సమీపంలోని నూర్‌షావలి దర్గా పక్కనే ఉన్న కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లిఖార్జున తెలిపారు. వారి నుంచి రూ.15,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు కొలిమిగుండ్ల బ్రీడ్స్ యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బ్రీడ్స్ బోయ రవికుమార్, రామాచారి, అన్వేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన ఆళ్లగడ్డకు చెందిన విశ్వహర్షిణి, నిఖితారెడ్డి లను ఆర్ఆర్ అకడమీ నిర్వాహకులు బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్‌లు సుబ్బారాయుడు, శేషు, నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సుజాతారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీలు

- కోరంలేక వాయిదా పడిన మండల సమావేశం


మండల సమావేశంలో ఖాళీగా ఉన్న ఎంపీటీసీల కుర్చీలు

ప్యాపిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించారు. దీంతో బుధవారం నిర్వహించాల్సిన సమావేశాన్ని కోరంలేక వాయిదా వేస్తున్నట్లు ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు ప్రకటించారు. మండలంలో మొత్తం 21 ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. అందులో 16మంది వైసీపీ, ఐదుగురు టీడీపీ ఎంపీటీసీలు ఉన్నారు. అయితే వీరికి మూడు ఏళ్లుగా వేతనాలు చెల్లించడం లేదు. వేతనాల కోసం ఆందోళనలు కూడా చేశారు. అయితే ప్రభుత్వాల్లో చలనం రాలేదు. దీంతో ఎంపీటీసీలు అందరూ మాట్లాడుకొని మండల మీట్‌ను బహిష్కరించారు. వీరికి మద్దతుగా సర్పంచులూ సమావేశాన్ని బహిష్కరించారు. వేతనాలు ఇస్తేనే సమావేశానికి హాజరవుతామని ఎంపీటీసీలు ప్రకటించారు.

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

కొవెలకుంట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసుశాఖ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్‌ను విద్యార్థినులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూలులో శక్తి యాప్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చిన్నారుల భద్రత, రక్షణ, మహిళల కోసం పోలీసుశాఖ శక్తి యాప్ అందుబాటులో ఉందని, ఈ యాప్ ఉంటే నిరంతరం ఓ సోదరుడు మీకు తోడుగా ఉన్నట్లు ధైర్యంగా ఉండవచ్చన్నారు. యాప్ ప్రతిఒక్కరూ డౌన్ లోడు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సిస్టర్ గీత, సిస్టర్ రోజా, బాల సిస్టర్, పీఈటీలు, ఉపాధ్యాయు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయ అభివృద్ధికి దాతలు విరాళం అందించారు. బుధవారం నందవరం గ్రామానికి చెందిన కోటేశ్వరరెడ్డి కుమార్తె శివమ్మ కుటుంబ సభ్యులు ఆలయాభివృద్ధికి రూ. 71వేల విరాళం ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు.

మహిళలు జాగ్రత్తగా ఉండాలి

డోన్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో గ్యాస్ వాడే సమయంలో మహిళలు జాగ్రత్తలు పాటించాలని డోన్ అగ్నిమాపక శాఖ అధికారి ఎం.రంగస్వామి గౌడు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఇందిరానగర్‌లోని ఆంజనేయస్వామి గుడి ప్రాంతంలో మహిళలకు అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీ అయినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని, మంటలు వ్యాపించిన సమయంలో ఎలా ఆర్పాలనే వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రభాకర్, రాజశేఖర్, నాగేంద్ర, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ తరగతులను నిర్వహించాలని ఎంఈవో ప్రభాకర్, ఎంఈవో-2 రామనర్సప్ప అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈవోలు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో యూనిఫామ్స్, బెల్టులు, పుస్తకాలు వంటివి విక్రయించరాదన్నారు. తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. సమావేశంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛ దివస్'ను విజయవంతం చేయండి

డోన్ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నెలలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19న శనివారం ఉదయం గాంధీచౌక్ వద్ద పట్టణ ప్రజలతో ప్రతిజ్ఞ స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో న్యామతుల్ల ఆదేశించారు. బుధవారం మండలంలోని పెద్దవంగలి గ్రామంలోగల స్పెషల్, ప్రాథమిక పాఠశాల, బుగ్గవీధిలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల వార్షిక పరీక్షలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు.హెచ్‌ఎంలు నరసింహులు, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

చాగలమర్రి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఉపాధిహామీ ఏపీవో ఖాసీం అన్నారు. బుధవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 గ్రామ పంచాయతీల్లో నీటితొట్ల పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీఏలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ అన్నారు. బుధవారం చాగలమర్రి పశువైద్యకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత వల్ల పశువులకు వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వడదెబ్బ సోకితే తక్షణమే పశువులకు వైద్య చికిత్సలు చేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వెల్లాల క్షేత్రంలో వేలం

చాగలమర్రి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాలకు సంబంధించిన భూములు, నిత్యావసర వస్తువులకు గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో కేవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. ఐదువేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఆలయాల్లో భక్తులు అందించిన నిత్యావసర వస్తువులకు రూ.1,000 డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

పౌష్టికాహార లోపం నివారించాలి

చాగలమర్రి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పిల్లలల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికే పోషణ్ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. బుధవారం స్థానిక కోటగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో వెయ్యిరోజుల జీవనశైలి కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వెయ్యిరోజుల సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. బిడ్డ పుట్టిన తరువాత ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

రుద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల గ్రామంలో పోలేరమ్మ, పుట్టాలమ్మ పెద్దమ్మ అమ్మ వార్ల విగ్రహాలు, అలాగే లక్ష్మీనరసింహస్వామి, చెన్నకేశవ, నాగలింగేశ్వర స్వామి నూతన విగ్రహాల ప్రతిష్ఠ పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేదమంత్రోచ్చారణల మధ్య వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.